సాక్షి మంచిర్యాల

సోమవారం ׀ 8 ׀ జనవరి ׀ 2024



సారూ.. జీతాలు వస్తలేవ్!

రెండు నెలలుగా ఇవ్వకపోవడంతో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్లకుపైగా సమగ్రశిక్షలో ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. 8లో▸



ఆర్‌కే 5 గనిపై చోరీ

సింగరేణి సంస్థ ఆర్‌కే–5 గనిపై శనివారం రాత్రి చోరీ జరిగింది. కార్మికులు వస్తువులు భద్రపర్చుకునే గదిలో చొరబడిన దొంగలు 30 సెల్‌ఫోన్లు, రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.1 /18.4

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. ఉదయం పొగ మంచు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జడ్జికి అయోధ్య రాముడి అక్షింతలు



అక్షింతలు అందజేస్తున్న వేద పండితులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో అయోధ్య అక్షింతలను ఇంటింటా పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి జె.ముఖేష్ దంపతులకు ఆదివారం శ్రీరాముడి అక్షింతలను శ్రీ కోదండ రామాలయం వేద పండితులు మురళి, వేణు అందజేశారు. న్యాయమూర్తి దంపతులు అక్షింతలను భక్తిశ్రద్ధలతో స్వీకరించారు.

లెక్చరర్లు బాధ్యతగా పనిచేయాలి



నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర బాధ్యులు

మంచిర్యాలఅర్బన్: నూతనంగా రెగ్యులరైజ్ అయిన లెక్చరర్లు అందరూ మరింత బాధ్యతగా పనిచేయాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్ అన్నారు. మంచిర్యాలలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ సంఘం పటిష్టంగా ఏర్పాటు చేసి సమస్యలపై చొరవ చూపాలన్నారు. అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

జిల్లా అధ్యక్షుడిగా బండి ప్రసాద్..

తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బండిప్రసాద్, ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్, కోశాధికారిగా సోమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రామయ్య, శ్రీకాంత్‌శర్మ, జిల్లా మహిళా కార్యదర్శిగా సత్తెమ్మ, అనిత, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షఫీయుద్దీన్, వెంకటస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కిష్టయ్య



నియామక పత్రం అందుకుంటున్న కిష్టయ్య

పాతమంచిర్యాల: మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హాజీపూర్ మండల కేంద్రానికి చెందిన సోగాల కిష్టయ్య నియమి తులయ్యారు. హైదరాబాద్ నేరేడ్‌మెట్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి చేతుల మీదుగా సోగాల కిష్టయ్య నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్, జాతీయ ఉపాధ్యక్షుడు ముత్తమాల పుల్లయ్య, జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరి, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ఎరుకల శ్రీనివాస్, మాల మహానాడు సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ కార్యదర్శిగా యాదగిరి

బెల్లంపల్లి: మాల మహానాడు జాతీయ కార్యదర్శిగా బెల్లంపల్లికి చెందిన కాసర్ల యాదగిరి నియమితులయ్యారు. నేరేడ్‌మెట్‌లోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో యాదగిరిని జాతీయ కార్యదర్శిగా ఎంపిక చేశారు. జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థి



రిషాంక్

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలోని మహాత్మజ్యోతిబాపూలే బీసీ గు రుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రిషాంక్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల కు ఎంపిక య్యాడు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో ఈ నెల 6వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్‌స్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో రిషాంక్ విశేష ప్రతిభ కనబర్చాడు. దీంతో అతడిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు జనగామ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబ డ్డీ పోటీల్లో మంచిర్యాల జిల్లా నుంచి రిషాంక్ ప్రాతినిధ్యం వహిస్తాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రిషాంక్‌ను, ఇందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు కొట్టె దేవేందర్‌ను ప్రిన్సిపాల్ షేరు శ్రీధర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్, డెప్యూటీ వార్డెన్ సందీప్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

మందకొడిగా యాసంగి!



- సాగు నీటి లభ్యతపై స్పష్టత కరువు
- వరి సాగుకు వెనుకాడుతున్న రైతులు
- ఆరుతడి సాగు అంతంతే..
- సూచనలు చేయని వ్యవసాయ అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో యాసంగి పంటల సాగు మందకొడిగా సాగుతోంది. సీజన్ ఆరంభమై రెండు నెలలు గడిచింది. సాగుకు సరిపడా నీరు అందుతుందో, లేదో అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో రైతుల్లో అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలో వరి వేయాలో.. ఆరుతడి పంటలు సాగు చేయాలో తేల్చుకోలేకపోతున్నారు. గతేడాది నిండుకుండలా ఉన్న గోదావరి ఈ ఏడు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల డ్యామేజీతో ఖాళీ అయింది. ఈ క్రమంలో వరిసాగుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు.

ఇప్పటి వరకు 62 శాతమే..

యాసంగి సీజన్ అక్టోబర్ చివరి నుంచి ప్రారంభమవుతుంది. డిసెంబర్, జనవరి వరకు వరి సాగుకు అనుకూలం. యాసంగి వరి సాగు అంచనా 98,860 కాగా ఇప్పటి వరకు 61,633(62 శాతం) సాగైంది. ఇంకా 13,285 మొలక (నర్సరీ) దశలోనే ఉంది. ఫిబ్రవరి మొదటి వారం వరకు నాట్లు కొనసాగేలా ఉన్నాయి. ఆరుతడి పంటల సాగు సైతం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. వానాకాలంలో వేసుకున్న పత్తి ఏరేందుకు, వరి కోతలకు కూలీ ల కొరత ఎదురవుతోంది. ఈ కారణంగా కూడా రైతులు వరి సాగుకు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

సాగు నీటిపై ఆందోళన..

యాసంగిలో అధికంగా వరి సాగవుతుంది. ఇప్పటికే వరినాట్లు పూర్తికావాల్సి ఉండగా, వానాకాలం పంటలు ఆలస్యం కావడంతో దాని ప్రభావం యాసంగి సాగుపై పడింది. యాసంగిలో 95 శాతం దొడ్డు రకం వరిసాగు చేస్తారు. వరి తర్వాత మొక్క జొన్న, శనగ, కంది పంటలు సాగవుతాయి. జిల్లా నీటి వనరులు కడెం ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీ చేరడంతో ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించారు. గూడెం ఎత్తిపోతల పథకం నుంచి డిస్ట్రిబ్యూటరీ 30 నుంచి 42 వరకు 2 టీఎంసీల నీటిని 90 రోజులు వారబందీ పద్ధతిలో 15 వేల ఎకరాలకు మాత్రమే అందిస్తున్నారు. దీంతో వరి సాగుకు రైతులు వెనుకాడుతున్నారు. బోర్లు, బావులు ఉన్నవారు మాత్రం మొక్క జొన్న సాగు చేస్తున్నారు.

పంట	సాధారణ సాగు	ఇప్పటి వరకు సాగు(ఎకరాలు)
వరి	98,860	61,633
మొక్కజొన్న	2,449	841
వేరుశనగ	510	233
పెసలు	435	38
జొన్న	328	74
కందులు	240	58
నువ్వులు	202	10
మినుములు	155	58
శనగ	430	20
ఇతర పంటలు	670	147
మొత్తం	1,04,279	63,112 ఎకరాలు

ఆరుతడి పంటలు అంతంతే..

నీటి వనరులు లేని రైతులు పొద్దు తిరుగుడు, పెసర, మినుము, ఉలవలు సాగుచేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో ఆరుతడి పంటలు 8,500 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశారు. కానీ, ఇప్పటి వరకు 1,479 ఎకరాల్లో మాత్రమే సాగుచేశారు. శనగ, మొక్కజొన్న పంటలు మాత్రమే సాగు చేస్తున్నారు.

గోదావరిలో దొంగలు!



రహస్య ప్రాంతాల్లో ఇసుక డంపులు

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- మైనింగ్ అధికారులకు చుక్కలు చూపుతున్న ఇసుక మాఫియా
- శాఖల మధ్య సమన్వయ లోపం?
- ప్రభుత్వ ఆదాయానికి ఏటా రూ.కోటి గండి



రాత్రి గోదావరి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

మంచిర్యాలక్రైం: గోదావరిలో ఇసుక దొంగలు రెచ్చిపోతున్నారు. తమను అడ్డుకునేవారు ఎవరు అన్నట్లుగా ఇసుకను తరలించుకుపోతున్నారు. కొందరు జేసీబీలతో, మరికొందరు కూలీలతో గంగలో ఇసుక తవ్వకాలు జరిపి లారీల్లో తరలించి రహస్య ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. తర్వాత ఇసుక కొరత సృష్టించి ఎక్కువ ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక మాఫియా అంతా ఒక్కటై అక్రమ రవాణాను అడ్డుకునే మైనింగ్ అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు.

మూడు టీంలతో గస్తీ..

జిల్లాలో ఇసుక మాఫియా అక్రమ రవాణా అడ్డులేకుండా సాగేందుకు మూడు టీంలను ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక ఓవర్ బ్రిడ్జి నుంచి గోదావరి వరకు ఈ టీంలు గస్తీ నిర్వహిస్తాయి. పోలీసులు, మైనింగ్ అధికారుల కదలికలను గమనిస్తూ ఎప్పటికప్పుడు ఇసుక తవ్వకాలు జరిపేవారికి సమాచారం అందిస్తారు. అధికారులు వస్తున్నారని తెలిసిన వెంటనే అందరూ అక్కడి నుంచి మాయమవుతారు. ఇక ఎప్పుడైనా అధికారులు తారసపడితే.. వారిపై దాడి చేసేందుకు కూడా వెనుకాడడం లేదు. దీంతో ఒంటరిగా ఇసుక రవాణాను అడ్డుకునేందుకు అధికారులు జంకుతున్నారు.

శాఖల మధ్య సమన్వయ లోపం..

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంలో రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల మధ్య సమన్వయం కొరవడుతోంది. ఎవరికి వారు.. అడ్డుకునే ప్రయత్నాలు చేయడం ఇసుక మాఫియాకు కలిసి వస్తోంది. మూడు శాఖలు కలిసి కట్టుగా దాడులు నిర్వహిస్తే అక్రమ రవాణాను అడ్డుకునే అవకాశం ఉంది. కానీ, ఈ శాఖల అధికారులు ఐక్యంగా పనిచేయడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మరోవైపు ఇసుక మాఫియాకు కొందరు రాజకీయ నాయకులు, అధికారులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

తప్పుడు సమాచారం ఇస్తూ..

వేంపల్లి, ముల్కల్ల గోదావరి నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఈ మేరకు మాఫియా నుంచే మైనింగ్ అధికారులకు సమాచారం ఇస్తున్నారు. దీంతో అధికారులు ఆయా ప్రాంతాలకు తనిఖీలకు వెళ్తున్నారు. ఇంతలో వందల ట్రాక్టర్లతో మంచిర్యాల శివారులోని గోదావరిలోకి చొరబడుతున్నారు. ఇసుక లోడ్ చేసుకుని వెళ్లిపోతున్నారు. ఇలా అధికారులను తప్పుదోవ పట్టిస్తూ అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. శాఖల మధ్య సమన్వయం ఉంటే ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని స్థానికులు పేర్కొంటున్నారు.

సిబ్బంది కొరత..

ఒకవైపు శాఖల మధ్య సమన్వయం లేకపోగా, మరోవైపు సిబ్బంది కొరత కూడా ఇసుక అక్రమ రవాణాకు అనుకూలంగా మారిందని తెలుస్తోంది. జిల్లా మైనింగ్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఏడీతోపాటు ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారుల నుంచి సహకారం లభించకపోవడంతో మైనింగ్ అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టలేకపోతున్నారు.

ఏటా రూ.కోటి ఆదాయానికి గండి...

జిల్లాలో ఇసుక అనుమతులు ఇవ్వక పోవడంతో ఏడాదికి సుమారుగా రూ.కోటి ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతోంది. మైనింగ్ అధికారులు ఇసుక రీచ్‌లు గుర్తించి అనుమతులు ఇస్తే ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అక్రమ రవాణా కూడా తగ్గుతుంది. ఇసుక కృత్రిమ కొరత సృష్టించే అవకాశం ఉండదు. ధర కూడా అందుబాటులో ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు ఇసుక రీచ్‌లను గుర్తించి అనుమతి ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని జిల్లా వాసులు సూచిస్తున్నారు.

రీచ్‌ల అనుమతికి సహకరించడం లేదు...



మంచిర్యాల గోదావరిలో ఇసుక తరలించేందుకు అనుమతి ఇవ్వొద్దనే నిబంధనలు ఉన్నాయి. సమీపంలోని ముల్కల్ల, వేంపల్లిలో ఇసుక రీచ్‌లకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. ఇందుకు ఆయా పంచాయతీలు తీర్మానం ఇవ్వాలి. ఫలితంగా పంచాయతీలకు రాయల్టీ రూపంలో ఆదాయం వస్తుంది. కానీ, పంచాయతీ సిబ్బంది ఇందుకు సహకరించడం లేదు. దీంతో ఇసుక రీచ్‌లు ఏర్పాటు కావడం లేదు.

– బాలు, మైనింగ్ ఏడీ, మంచిర్యాల

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న



మాట్లాడుతున్న వెంకన్న

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదిలాబాద్ రీజినల్ ఎంప్లాయిస్ యూనియన్ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తొమ్మిదేళ్లుగా ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. హక్కుల కోసం పోరాడే యూనియన్లపై ఉక్కుపాదం మోపడంతో కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ ప్రకటించకపోగా, డీఏ, సీసీఎస్, పీఎఫ్ కార్మికుల బకాయిలు ఇవ్వడంలో తాత్సారం చేసిందని తెలిపారు. రీజినల్ కార్యదర్శి భీమేశ్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, ఆర్టీసీ ఎంప్లాయిస్ నాయకులు లక్ష్మణ్, బొట్టు లక్ష్మణ్, మామిడి శ్రీనివాస్, మంచిర్యాల, ఆసిఫాబాద్ డిపో అధ్యక్ష కార్యదర్శులు రాజేశం, గోలిశంకర్, అశోక్, దివాకర్, శ్రీధర్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు రూ.12 వేలు చెల్లించాలి

బెల్లంపల్లి: క్వింటాల్ పత్తికి మద్దతు ధర రూ.12 వేలు చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలోని సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా శోభన్ హాజరై మాట్లాడారు. పత్తికి మద్దతు ధర దక్కడం లేదన్నారు. క్వింటాల్‌కు రూ.6,550 చెల్లించి దళారులు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. పెట్టుబడి పెరిగి, మద్దతు ధర దక్కక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పత్తి కొనుగోలులో దళారుల పాత్ర లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.రవి, తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి నాయకుడు సింగతి రవి, ఇందూరి తిరుపతి, రైతుసంఘం నాయకులు భూమయ్య, బాపు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పోరుపై అయోమయం

- ఈ నెలాఖరుతో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
- పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాని స్పష్టత
- రిజర్వేషన్లపై ఆశావహుల్లో టెన్షన్
- జిల్లాలో 311 గ్రామ పంచాయతీలు



హాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాయి. మరో నెల రోజుల్లో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో సర్పంచ్ ఎన్నికలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. దీంతో గ్రామాల్లో అయోమయం నెలకొంది. ఓ వైపు పంచాయతీ ఎన్నికలపై గ్రామాల్లో విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. కానీ ఎన్నికలు ఎప్పుడు అనే విషయంలో మాత్రం సందిగ్ధం నెలకొంది.

అధికారుల ఏర్పాట్లు..

ఎన్నికల నిర్వహణపై స్పష్టత రాకపోయినా.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు మాత్రం ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటరు జాబితా, ఎన్నికల అధికారుల నియామకం తదితర ప్రక్రియను పూర్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇదే ఊపుతో పంచాయతీ ఎన్నికలు కూడా నిర్వహించి గ్రామాల్లో పట్టు సాధించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అధికారిక ప్రకటన కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు. 2019, ఫిబ్రవరి 2న పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఈనెలాఖరుతో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ముగియనుంది. గడువు నెల రోజులే ఉండడంతో పనులు పూర్తిచేసి, మరోమారు ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రస్తుత సర్పంచులు భావిస్తున్నారు. ఆశావహులు కూడా ప్రజల మద్దతు కూడగట్టే పనిలో ఉన్నారు.

రిజర్వేషన్లపై చట్టం..

ఇదిలా ఉంటే.. 2018 నూతన పంచాయతీరాజ్ చట్టం రూపొందించారు. దీని ప్రకారం పంచాయతీల రిజర్వేషన్లు పదేళ్లు అమలులో ఉంటాయి. ఈ లెక్కన, ఈసారి కూడా పాత రిజర్వేషన్లే అమలు చేయాలి. జిల్లాలోని 16 మండలాల్లో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల్లో రిజర్వేషన్ అంశం ఆశావహులను గందరగోళానికి గురిచేస్తోంది. రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం మారుస్తుందని కొంతమంది భావిస్తున్నారు. మరికొందరు పాత చట్టం ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని పేర్కొంటున్నారు. ఈ విషయంలోనూ స్పష్టత రావాల్సి ఉంది.

సిద్ధంగా ఉన్నాం..



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా, పోలింగ్ బూత్‌ల ఎంపిక, బ్యాలెట్ బాక్సుల సేకరణ పూర్తి చేయడంతోపాటు ఎన్నికల సిబ్బంది నియామక ప్రక్రియ పూర్తి చేశాం. మరోసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పునః సమీక్షిస్తాం. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా అందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– వెంకటేశ్వర్‌రావు, డీపీవో

నెగ్గుతారా.. తగ్గుతారా?

- బెల్లంపల్లి మున్సిపల్ 'అవిశ్వాసం'పై ఉత్కంఠ
- పార్టీలకు అతీతంగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నోటీసు
- తాజాగా పార్టీల వారీగా విడిపోయిన కౌన్సిలర్లు



బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌పై సభ్యులు ప్రతిపాదించిన అవిశ్వాసంపై రోజు రోజుకూ ఉత్కంఠ పెరుగుతోంది. అవిశ్వాసం నోటీసుపై ఈనెల 12న ఓటింగ్ నిర్వహించాలని కలెక్టర్ నిర్ణయించారు. ఈమేరకు సభ్యులకు నోటీసు పంపించారు. ఇక్కడి వరకు అంతా బాగానే ఉంది. అవిశ్వాసం నోటీసు వరకు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉన్న కౌన్సిలర్లు.. ఇప్పుడు పార్టీల వారీగా విడిపోయారు. దీంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ అవిశ్వాసం నెగ్గుతారా.. లేక తగ్గుతారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కౌన్సిలర్లు చీలిపోవడంతో గందరగోళం నెలకొంది.

మారుతున్న సమీకరణాలు..

బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 మంది సభ్యులు ఉన్నారు. ఒకరు అనారోగ్యంతో మృతిచెందాడు. ప్రస్తుతం 33 మంది ఉన్నారు. చైర్‌పర్సన్‌గా జక్కుల శ్వేత, వైస్ చైర్మన్‌గా బత్తుల సుదర్శన్ బీఆర్‌ఎస్ తరఫున ఎన్నికయ్యారు. వీరిపై మెజారిటీ సభ్యులు ఇటీవల అవిశ్వాసం ప్రకటించారు. దీంతో చైర్‌పర్సన్ శ్వేత అనూహ్యంగా బీఆర్‌ఎస్‌ను వీడి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వైస్ చైర్మన్ సుదర్శన్ బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఏ పార్టీలో ఉన్నా.. సభ్యులు పార్టీలకు అతీతంగా అవిశ్వాసం ప్రకటించారు.

నెగ్గడానికి 22 మంది.. వీగడానికి 12 మంది..

అయితే ఇప్పుడు ట్విస్ట్ నెలకొంది. 33 మంది సభ్యులకుగాను బీఆర్‌ఎస్ పార్టీకి వైస్ చైర్మన్‌తో కలుపుకుని 21 మంది బలం ఉంది. చైర్‌పర్సన్‌తో కలుపుకుని కాంగ్రెస్ పార్టీకి 11 మంది సభ్యులు ఉన్నారు. ఒకరు బీజేపీ కౌన్సిలర్. అవిశ్వాసం నెగ్గాలంటే 22 మంది సభ్యులు అనుకూలంగా ఓటు వేయాలి. వీగిపోవాలంటే 12 మంది సమావేశానికి గైర్హాజరు కావాల్సి ఉంటుంది. ఈ లెక్కన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీకి ఒక్కో సభ్యుడు తక్కువగా ఉంటున్నారు. అవిశ్వాసం విషయంలో ఎమ్మెల్యే వినోద్ ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. చివరి నిమిషంలో ఎమ్మెల్యే ఏం చేస్తారన్నది కూడా ఆసక్తిగా మారింది.

ఎవరి మద్దతు ఎవరికో..?

పదవిని దక్కించుకోవడానికి చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ స్టాండ్ ఏంటో అంతుచిక్కడం లేదు. ఇద్దరికీ అవిశ్వాసం ప్రతిష్ఠాత్మకంగా మారింది. మరోవైపు బీఆర్‌ఎస్‌కు చెందిన 18 మంది కౌన్సిలర్లు ఇప్పటికే శిబిరానికి వెళ్లారు. మరో ఇద్దరు వ్యక్తిగత కారణాలతో ఇంటివద్దనే ఉన్నారు. మరో సభ్యుడు వైస్ చైర్మన్. ఇక చైర్‌పర్సన్ కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ ఆమెకు ఆ పార్టీ సభ్యులు సహకరించే అవకాశం లేదని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తే ఏ పార్టీ సభ్యుడు ఏ తీరుగా వ్యవహరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



టోర్నమెంట్ విజేత ప్రగతి స్టేడియం 11 జట్టు

మంచిర్యాలటౌన్: రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అటల్ బిహారి వాజ్‌పేయి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మొత్తం 44 జట్లు పాల్గొనగా, మంచిర్యాలకు చెందిన ఆర్‌సీసీ–బీ 11 జట్టు, శ్రీరాంపూర్‌కు చెందిన ప్రగతి స్టేడియం 11 జట్టు ఫైనల్‌లో తలపడ్డాయి. ప్రగతి స్టేడియం జట్టు విజేతగా నిలిచింది. విన్నర్స్‌కు, రన్నర్స్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ట్రోఫీతోపాటు, క్యాష్ ప్రైజ్ అందించారు. విజేత జట్టుకు రూ.10 వేలు, రన్నర్‌గా నిలిచిన ఆర్‌సీసీ–బీ జట్టుకు రూ.5 వేలు అందించారు. మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా రంజిత్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ప్రదీప్ నిలిచారు.

కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీలో పీఎస్సార్



ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనుండడంతో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీని ప్రకటించింది. ఈ కమిటీలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు చోటు లభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలక్షన్ కమిటీకి చైర్మన్‌గా నియమించారు. కమిటీలో 24 మంది సభ్యులు ఉండగా, ప్రేమ్‌సాగర్‌రావుకు చోటు దక్కింది.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మేక మృతి


మృతి చెందిన మేకతో బాధితుడు

వేమనపల్లి: విద్యుదాఘాతంతో మేక మృతి చెందిన సంఘటన మామడలో చోటు చేసుకుంది. మండలంలోని మామడ గ్రామానికి చెందిన గజ్జి సారయ్య ఆదివారం మేకను మేపేందుకు నీల్వాయి సమీపంలోని పంట పొలాల్లోకి వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తాకడంతో మేక మృతి చెందింది. విద్యుత్ అధికారులు నష్టపరిహారం ఇప్పించాలని బాధితుడు కోరుతున్నాడు.

ప్రాణహితలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


ధర్మయ్య మృతదేహం

బెజ్జూర్: ప్రాణహితలో గల్లంతైన వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. లోడ్‌పెల్లి గ్రామ పంచాయతీలో కామటిగా పనిచేస్తున్న ఆత్రం ధర్మయ్య (60) బోనాల సందర్భంగా లోడ్‌పెల్లి నుంచి బెజ్జూర్ ప్రాణహిత నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చి గల్లంతయ్యాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి స్వాధీనం


సీజ్ చేసిన వాహనం, నిందితుడితో పోలీసులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.1 గ్రామానికి చెందిన రాజ్‌సర్కార్ ఆదివారం గంజాయి తరలిస్తూ పట్టుబడినట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు. విలేజ్ నెం.3 గ్రామానికి చెందిన రాహుల్ మండల్ వద్ద 30 గ్రాముల గంజాయిని కొనుగోలు చేశాడని తెలిపారు. రాహుల్ మండల్ పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రాజ్‌సర్కార్ వద్ద ఉన్న స్కూటర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి వలస కూలీ మృతి

లోకేశ్వరం(ముధోల్): పురుగుల మందు తాగి వలస కూలీ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం కుభీర్ మండలంలోని పల్సి గ్రామానికి చెందిన కుంచపు గణేశ్ (40) తొమ్మిదేళ్ల క్రితం లోకేశ్వరం మండలంలోని పోట్‌పల్లి గ్రామానికి వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం వలస వచ్చాడు. అప్పటి నుంచి గ్రామంలోనే పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

సారూ.. జీతాలు వస్తలెవ్!

- రెండు నెలలుగా విడుదలకాని వేతనాలు
- ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు
- కుటుంబ పోషణ భారంగా మారిన వైనం


మంచిర్యాలలో ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు (ఫైల్)

జిల్లాల వారీగా సీఆర్పీల వివరాలు	
మంచిర్యాల	596
ఆదిలాబాద్	657
నిర్మల్	702
కుమురంభీం	519
మొత్తం	2,474

మంచిర్యాలఅర్బన్/లక్ష్మణచాంద: అసలే అరకొర వేతనాలు.. అవికూడా రెండు నెలలుగా ఇవ్వకపోవడంతో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్లకు పైగా సమగ్రశిక్షలో ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మండల, జిల్లా కార్యాలయాల్లో పలు కార్యక్రమాల అమలులో కీలకంగా వ్యవహరించే ఎయిడెడ్, సమగ్రశిక్ష, కేజీబీవీ, యూఆర్‌ఎస్, ఇతర పాఠశాలల ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో అనేక అవస్థలు పడాల్సి వస్తోంది.

ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు

ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీల్లో విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీ సీఆర్టీలు, సీఆర్‌టీలు, ఏఎన్‌ఎం, అకౌంటెంట్‌లు, నాన్ టీచింగ్ సిబ్బంది, మండల, జిల్లా స్థాయిలో ఎంఐఎస్‌సీవో, సీసీవోలు, ఐఈఆర్పీలు, సీఆర్పీలు.. ఇలా పలు విభాగాల్లో మొత్తం 2,474 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వారికి గతేడాదికి సంబంధించిన నవంబర్, డిసెంబర్ నెలల వేతనాలు నిలిచిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వచ్చే జీతాలు అంతంత మాత్రమే కావడంతో నెలవారీ ఖర్చులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి.

జీతాల చెల్లింపులు ఇలా..

సమగ్రశిక్ష అభియాన్ నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 శాతంలో మంజూరు చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం తనవంతు వాటా చెల్లించినా రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా జమ చేయకపోవడంతోనే జాప్యం జరుగుతోందని ప్రచారంలో ఉంది. డీఈవో, ఎంఈవో కార్యాలయాల్లో సిబ్బందితో పాటు భవిత కేంద్రాల్లో, కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లో విధులు నిర్వహించే ఉద్యోగులకు కనిష్ఠంగా నెలకు రూ.5,500 నుంచి రూ.25 వేల వరకు ప్రతినెలా పొందుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా విధులు నిర్వహిస్తున్నా ఇతర సదుపాయాలేమీ వారికి వర్తించడం లేదు.

మంచిర్యాల జిల్లాలో ..

మంచిర్యాల జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 596 మంది ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో కేజీబీవీలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది 424 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరి వేతనాలతో పాటు సరుకులు పంపిణీ చేసే గుత్తేదారులకు కూడా బడ్జెట్ మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. నెలల తరబడి బిల్లులు పేరుకుపోతుండడంతో గుత్తేదారులకు ఎలా చెప్పాలో అర్థంకాక ఎస్‌వోలు తలలు పట్టుకుంటున్నారు. వేతనాలతో పాటు డైస్ బిల్లులు కూడా చెల్లించాలని కోరుతున్నారు.

నిర్మల్ జిల్లాలో...

నిర్మల్ జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 702 మంది ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో డీపీవో సిబ్బంది 8 మంది, కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది 458 మంది, యూఆర్‌ఎస్ బోధన, బోధనేతర సిబ్బంది 13 మంది, ఎంఆర్‌సీ సిబ్బంది 180 మంది, ఎమ్మార్సీ పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్ 43 మంది కలిపి మొత్తంగా 702 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వారికి నెలనెలా వేతనం రూ.5,500 నుండి రూ.32,500 వరకు ఉంది.

కుమురంభీం జిల్లాలో

కుమురంభీం జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మొత్తం 519 మంది ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో డీపీవో సిబ్బంది ఏడుగురు, కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది 362 మంది, ఎమ్మార్సీ సిబ్బంది 68 మంది, సీఆర్పీ, పీటీఐ సిబ్బంది 82 మంది విధులు నిర్వహిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న మాకు నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన వేతనాలు రావడం లేదు. దీంతో పాఠశాలకు రావడానికి ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– సౌజన్య, ఆర్ట్ టీచర్, జెడ్పీఎస్‌ఎస్, మన్మధ్, నిర్మల్

వేతనాలు విడుదల చేయాలి



రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వేతనాలు విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– గంగాధర్, సీఆర్పీ, పల్సి, కుభీర్, నిర్మల్

వారంలోగా వచ్చే అవకాశం



జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో ఒప్పంద ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. కేంద్రం వాటా నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్రం వాటా విడుదల చేయకపోవడంతో వేతనాలు ఆగిపోయాయి. వారంలోగా నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

– రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్



మొక్కలు నాటారు.. సంరక్షణ మరిచారు

మంచిర్యాల అటవీ డివిజన్ పరిధిలోని భీమారం రిజర్వు ఫారెస్ట్‌లో నాటిన మొక్కలకు నీరందించక పోవడంతో ఎండిపోతున్నాయి. గతేడాది అడవిలో చెట్లు లేనిచోట తిరిగి పచ్చదనం కల్పించేందుకు అటవీశాఖ అధికారులు మొక్కలు నాటించారు. కానీ వాటి సంరక్షణ మర్చిపోవడంతో ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా భీమారం జాతీయ రహదారి పక్కనే కోతులకు ఆహారం అందించేందుకు నాలుగేళ్ల క్రితం నాటిన పండ్ల మొక్కలు కూడా నీరు లేక ఎండిపోతున్నాయి. – భీమారం

ఒకరి రిమాండ్

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో శనివారం ఒకరిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని ఆదివారం రిమాండ్ చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొమ్మెన శశికాంత్ రూ.2 వేల విషయంలో అదే గ్రామానికి చెందిన సంగర్తి అరుణ్, అతని తల్లి సుగుణతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో గొడ్డలితో దాడిచేయగా సుగుణకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడు శశికాంత్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

ఆర్‌కే 5 గనిపై చోరీ

- కార్మికుల విలువైన వస్తువులు అపహరణ
- సంఘటన స్థలాన్ని సందర్శించిన కార్మిక సంఘాల నాయకులు


గనిపై పరిశీలిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే–5 గనిపై శనివారం రాత్రి చోరీ జరిగింది. రాత్రి షిఫ్టులో కార్మికులు తమ విలువైన వస్తువులను వారికి కేటాయించిన పెట్టెలలో భద్రపర్చుకుని తాళాలు వేసి గనిలోకి దిగారు. విధులు ముగించుకుని ఆదివారం తెల్లవారు జామున గనిపైకి చేరుకుని పెట్టెల వద్దకు వెళ్లి చూడగా సుమారు 40 పెట్టెల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అందులో భద్రపర్చిన 30 సెల్‌ఫోన్‌లు, రూ.10 వేల నగదు, ఇతర విలువైన వస్తువులు కనిపించకపోవడంతో గని అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదు

ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా మాట్లాడుతూ సంస్థ యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదని విమర్శించారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వల్లనే కార్మికుల విలువైన వస్తువులు దొంగిలించబడ్డాయన్నారు. కార్మికులకు రెస్ట్ హాల్స్, శాశ్వత కబోర్డులు, వాచ్‌మెన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫిట్ కార్యదర్శి గుడికంటి నర్సింహారావు, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, మల్లేశ్, రాజేశ్, నాగరాజు, తిరుపతి, తదితరులు ఉన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

ఐఎన్టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు మాట్లాడుతూ బాధ్యులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, కేంద్ర ఉపకార్యదర్శి స్వామి, నాయకులు సమ్మిరెడ్డి, పేరం రమేశ్, కే.సురేందర్‌రెడ్డి, ఆర్.మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, నీలం సదయ్య, సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

మంత్రి ‘తుమ్మల’ను కలిసిన ‘దండంరాజ్’

- సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రాంచందర్‌రావు

నస్పూర్: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దండంరాజ్ రాంచందర్‌రావు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. శనివారం రాత్రి సంఘం నాయకులతో కలిసి హైదరాబాద్‌లో మంత్రిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల, భద్రాచలం ఆలయాల్లో సింగరేణి ఉద్యోగులకు కల్పిస్తున్నట్లుగానే రిటైర్డ్ ఉద్యోగులకు వసతి సౌకర్యం కల్పించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు అన్నిరకాల వైద్య సేవలు అందించాలని, కరువు భత్యంతో కూడిన పెన్షన్ పెంచాలని, తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట సంఘం ఉప ప్రధాన కార్యదర్శి వేణుమాధవ్, రిటైర్డ్ డీవైజీఎం రాజు, తదితరులు ఉన్నారు.

మల్వాపై అధికారుల హైరానా...

- బొగ్గులో బురద కలిపితే నాణ్యత లోపించే అవకాశం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో అధికారులు పనికిరాని మల్వా (నల్లని బురద)పై హైరానా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ‘బొగ్గు చోరీ పేరిట .. జేసీబీ, లారీలు స్వాధీనం’ శీర్షికన ‘సాక్షి’లో కథనం ప్రచురితం కావడంతో జేసీబీ, రెండు లారీలు సింగరేణి పరిధిలోకి వచ్చాయని వాహనాలపై రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో సింగరేణి ఎస్‌అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అదే స్థలంలో ప్రస్తుతం మిగిలి ఉన్న మల్వాను జేసీబీ ద్వారా వెలికితీయించిన అధికారులు సీఎస్పీకి తరలిస్తున్నారు. ఐదారేళ్ల క్రితం సింగరేణి సంస్థ ఆర్యన్ కోల్ వాషరీ సంస్థకు బొగ్గు అప్పగించగా క్లీన్ చేసిన బొగ్గును సంస్థకు అప్పగించింది (ప్రస్తుతం వాషరీ సంస్థ పనిచేయడం లేదు) అనంతరం కురిసిన వర్షానికి కోల్ వాషరీ నుంచి బయటకు వచ్చిన మల్వాను అధికారులు సీఎస్పీకి తరలించే పనిలో పడ్డారు. ‘చారాన కోడికి బారాన మసాలా’ అన్న చందంగా పనికిరాని వ్యర్థాన్ని రవాణా చేయడానికి అనవసరంగా మ్యాన్ పవర్ వినియోగించడం ఏమిటని పలువురు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా వాటిని మళ్లీ బొగ్గులో కలిపితే నాణ్యత కోల్పోయే అవకాశం కూడా ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయమై సదరు అధికారిని వివరణ కోరగా కోల్ వాషరీ పక్కనే ఎస్‌ఎంఎస్ ప్లాంట్‌కు సింగరేణి స్థలం కేటాయించడం జరిగిందని, వారు ఏర్పాట్లకు సిద్ధమవుతున్నారన్నారు. బొగ్గు నుంచి వచ్చిన ప్రతీది వినియోగానికి ఉపయోగపడుతుందని, కోల్ వాషరీ పక్కన నిలువ ఉన్న వ్యర్థాన్ని సీఎస్పీకి తరలించి తర్వాత అధికారుల సూచనల మేరకు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.


నల్లటి బురదను వెలికితీస్తున్న జేసీబీ

అంటు మొక్కలు c/o భీమారం

- 200 కుటుంబాలకు ఉపాధి
- రాష్ట్ర వ్యాప్తంగా మొక్కల సరఫరా
- నాణ్యమైనవిగా రైతుల నమ్మకం
- మార్కెటింగ్ సదుపాయం కావాలని వినతి


భీమారం నర్సరీలో పెద్ద మామిడి అంటుమొక్కలు

భీమారం: తియ్యటి పండ్లు అందించే మామిడి తోటల వ్యాప్తికి కీలకమైన మామిడి అంటు మొక్కల నర్సరీలకు భీమారం కేరాఫ్‌గా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందింది. 40 ఏళ్ల క్రితం ప్రముఖ సంఘ సేవకుడు దివంగత ఎన్వీ.రాజారెడ్డి భీమారంలో ఐటీడీఏ ద్వారా అంటు మొక్కల నర్సరీకి తన భూమిని విరాళంగా ఇచ్చాడు. అంటు మొక్కల ఉత్పత్తికి నాంది పలికారు. అది ఇప్పుడు కుటీర పరిశ్రమగా మారింది. మండలంలోని భీమారం, అంకుసాపూర్, తాళ్లగూడెంలోని గిరిజన, దళిత కుటుంబాల రైతులు మొక్కల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఏటా దాదాపు 3 లక్షల మొక్కల వరకు అంటుకట్టి ఏడాది తర్వాత రైతులకు విక్రయిస్తున్నారు.

మొదట ప్రభుత్వపరంగా

దాదాపు 40 ఏళ్ల క్రితం ఐటీడీఏ ద్వారా భీమారంలో ఏర్పాటు చేసిన అంటుమొక్కల నర్సరీల్లో మామిడి మొక్కలకు అంటుకట్టే పద్ధతికి శ్రీకారం చుట్టారు. ఇందులో చెన్నూరు ప్రాంతంలోని వివిధ గ్రామాల గిరిజనులకు భీమారానికి రప్పించి అంటుకట్టడంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఒకవైపు శిక్షణ ఇస్తూనే మరోవైపు ఐటీడీఏ నర్సరీల్లో లక్షలాది మొక్కలు ఉత్పత్తి చేయడం ప్రారంభించింది. ఇక్కడి మొక్కలు ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సరఫరా చేసేవారు.

ప్రైవేటుకు ప్రోత్సాహం

ప్రభుత్వం ఐటీడీఏ నర్సరీతో పాటు అందులో శిక్షణ పొందిన గిరిజన, దళితులకు బ్యాంకు రుణాలు ఇప్పించి ప్రైవేట్‌గా మామిడి అంటు మొక్కల నర్సరీలను విస్తరించింది. దీంతో అనేక మంది యువకులు నర్సరీలు పెంచుకోవడం ప్రారంభించారు. అయితే అందులో పెంచిన మొక్కలను తిరిగి ప్రభుత్వం కొనుగోలు చేసి రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేసేవారు. దీంతో అనేక కుటుంబాలు నర్సరీలపై ఆధారపడ్డారు.

నిలిపివేతతో ఇబ్బంది..

దాదాపు 20 ఏళ్లక్రితం ఐటీడీఏ గిరిజన, దళిత రైతులు వారి నర్సరీల్లో పెంచిన మొక్కలను కొనుగోలు చేయడాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన భీమారం మొక్కలకు డిమాండ్ అధికంగా ఉండటంతో వివిధ జిల్లాల నుంచి రైతులే స్వయంగా వచ్చి ప్రైవేట్ నర్సీల్లో కొనుగోలు చేయడం ప్రారంభించారు. దాదాపు 200 కుటుంబాలు ఇదే వృత్తిని నమ్ముకుని ఇప్పటికీ అంటు పద్ధతిలో మొక్కలు పెంచి విక్రయిస్తున్నాయి. వీటిని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్‌కు సరఫరా చేస్తున్నారు.

మొక్కల రకాలు

మామిడి మొక్కల పెంపకం ద్వారా ఉపాధి పొందుతున్న నర్సరీలో రైతుల డిమాండ్ మేరకు వివిధ రకాలుపెంచుతున్నారు. ముఖ్యంగా బంగినపల్లి, దసేరి, మల్లిక, కొత్తపల్లి కొబ్బరి రకాలఅంట్లు తీసుకువచ్చి మొక్కలను తయారీ చేస్తున్నారు.వీటి ధర దాదాపు రూ.100 నుంచి 150 వరకు పలుకుతోంది.

ఒక్కో నర్సరీలో..

వ్యవసాయ భూములను లీజుకు తీసుకుని ఒక్కో గిరిజన, దళిత రైతు వెయ్యి నుంచి 3 వేల వరకు మొక్కలు పెంచుతున్నారు. జనవరి వరకు అవసరమైన అంటుని మామిడి తోటల్లో సేకరించి దానిని తల్లిమొక్కకు అంటు కట్టడం చేస్తారు. సంవత్సరం పెరిగిన అనంతరం రైతులకు విక్రయిస్తారు.

అమ్మకానికి 3 లక్షల మొక్కలు

మండలంలోని నర్సరీల్లో 3 లక్షల మామిడి అంటు మొక్కలు అమ్మకానికి ఉన్నాయి. గత సంవత్సరం వర్షాకాలంలో అనుకున్న స్థాయిలో మార్కెటింగ్ కాలేదు. దీనితో గతేడాదితో పాటు ఈసారి కలిపి 3 లక్షలకు చేరుకున్నాయి.

ఆయిల్‌పాం తోటలతో నష్టాలు



నేను 20 ఏళ్ల నుంచి నర్సరీలో మామిడి మొక్కలు పెంచుతున్నా. రెండేళ్ల నుంచి చాలా మంది రైతులు ఆయిల్‌పాం సాగుకు మొగ్గు చూపుతున్నారు. దీని ప్రభావం మామిడి మొక్కల విక్రయాలపై పడింది. అమ్మకాలు తగ్గిపోయాయి.

– సెగ్యం తిరుపతి, నర్సరీ రైతు, భీమారం

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి



గతంలో మాదిరిగా మామిడి మొక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేసి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– గోమాత శేఖర్, నర్సరీ రైతు, అంకుసాపూర్

ప్రచార బోర్డుల తొలగింపు


నాలుగు రాష్ట్రాలను కలిపే ఇందారం క్రాస్ రోడ్డులో హోర్డింగ్‌లు తొలగించిన దృశ్యం

జైపూర్: ఒక్కపక్క జాతీయ రహదారి.. మరోపక్క రాజీవ్ రహదారి.. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లే కీలకమైన కూడలి. మంచిర్యాల–చెన్నూర్ 63వ నంబర్, హైదరాబాద్ రాజీవ్ రహదారిపై ఉన్న ఇందారం క్రాస్ రోడ్డు వద్ద ఎటు చూసినా ప్రకటనల హోర్డింగులే. ఇవి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అటవీశాఖ భూముల్లో హోర్డింగులు పెరుగుతూ వస్తున్నాయి. ఇంత కాలం వాటిపై దృష్టిపెట్టని అటవీ, ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు ఎట్టకేలకు కొరడా ఝళిపించారు. ఆదివారం కూడలి వద్ద ఏర్పాటు చేసిన హోర్డింగులన్నీ తొలగించారు.


ఇందారం క్రాస్ రోడ్డు ప్రాంతంలో హోర్డింగ్‌లు తొలగించిన దృశ్యం

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

- రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు
- ఆపరేషన్ చేయాలని వైద్యుల సూచన
- ఆందోళనలో నిరుపేద కుటుంబం

దాతలు సాయం చేయాల్సిన నంబర్లు
మోర్లె పాండురంగ్, ఫోన్‌పే, గూగుల్ పే నంబర్ 8317507539
అకౌంట్ నంబర్ 62319443930,
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ : ఎస్‌బీఐఎన్0061739,
బ్రాంచ్: ఎస్‌బీఐ కౌటాల


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకర్

కౌటాల: రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబంలో రోడ్డు ప్రమాదం కష్టాలు తెచ్చిపెట్టింది. వివరాల్లోకి వెళ్తే..కౌటాల మండలంలోని గురుడుపేటకు చెందిన నికోడే శంకర్, లావణ్య దంపతులకు మూడేళ్ల కుమార్తె మేఘన, నాలుగు నెలల కుమారుడు హర్షిత్ ఉన్నారు. రోజు కూలీ పనిచేస్తేనే ఆ కుటుంబం గడుస్తుంది. ఈ నెల 5న శుక్రవారం ఉదయం శంకర్ కూలీ పనుల నిమిత్తం బైక్‌పై కౌటాలకు వెళ్లివస్తుండగా యాపలగూడ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రగాయాలు కావడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన కరీంనగర్‌కు తరలించారు. బ్రెయిన్ ఆపరేషన్ చేయాలని, రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు సూచించారు. దీంతో నిరుపేదలైన ఆ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కూలీ పనులకు వెళ్తేగాని కుటుంబ పోషణ గడవని పరిస్థితుల్లో అంత డబ్బు ఎలా సమకూర్చాలో తెలియక కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దాతలు, పాలకులు సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నా భర్తను కాపాడండి



మూడు రోజుల క్రితం నా భర్త నడుపుతున్న బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. తలకు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించాం. బ్రెయిన్ ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. చేతిలో చిల్లిగవ్వ లేదు. దాతలు, పాలకులు స్పందించి ఆదుకోవాలి. నా భర్తకు ప్రాణం పోయాలి.

– నికాడే లావణ్య, శంకర్ భార్య, గురుడుపేట